# "చచ్చి బ్రతికిన న్యాయం"

సానే గురూజీ

(కథానిక)

ఆవూళ్లో ఎంతమంది రైతులున్నారో, అందరి భూముల్నీ కొనేశాడు జమీందారు. ఒక్క సోమ్‌జీ మాత్రం తన పొలాన్నమ్మలేదు. రైతులందరూ కూలీలయ్యారు. ఏ పొలాల్నయితే తమ స్వంతంగా భావించి దున్నారో, వాళ్లే కూలికి దున్నుతున్నారు. సోమ్‌జీ పొలం ఏటి ఒడ్డునవుంది. అంతకుముందు ఎన్నిసార్లు చెప్పాడో ఏమిటోగాని, ఆఖరుసారిమాత్రం సోమ్‌జీ దగ్గరకువెళ్ళి జమీందారు అన్నాడుకదా—"ఇదిగో సోమ్‌జీ నా జీవితంలో ఇంతగా నేనెవర్నీ ఖుషామత్తు చెయ్యలేదు. నాశక్తి సామర్థ్యాలు నీకు పూర్తిగా తెలుసు. కాబట్టి, నువ్వుకోరిన ధరకన్నా ఓ మూణ్ణైదురూపాయలు ఎక్కువే ఇచ్చేస్తాను."

"క్షమించండి. భూమాత నమ్ముకోటం నాకు చేతకానిపని. డబ్బునేను కోరుక్కుతినాలా! డబ్బుతోనాకు సంబంధంలేదు. ఊళ్లోని తక్కిన రైతుసోదరులు ఏదో మూర్ఖత్వం చేశారంటే, నేనుకూడా వాళ్ళనే అనుసరించాలా! మీడబ్బు మీదగ్గరే వుంచుకోండి. మీ పొలంలోనే నే కూలీగా పనిచేసే అవసరం నాకులేదు;" అన్నాడు సోమ్‌జీ. "నన్నెదిరించినందుకు ఫలితం అనుభవిస్తావులే" జమీందారు గర్జించాడు... "మరేం ఫరవాలేదు. ఆ శ్రీరాముడే నన్ను రక్షిస్తాడు;" "సోమ్‌జీ ఇంకా నీకీ మంకుపట్టు ఎందుకు? పదివేలుతీసుకో. నీ జన్మలో ఇంతడబ్బు నువ్వెప్పుడూ చూడబోవు. దీనికి ఒప్పుకోకపోతే, నీకో ఎర్రని ఏగానిఅన్నా ఇవ్వకుండా, రేపే నేను స్వాధీనం చేసుకుంటాను. తెలుసా?"

త్వరలోనే సోమ్‌జీకి విరుద్ధంగా జమీందారు కేసుపెట్టాడు ఈవిధంగా—మొదట్లో ఆభూమి జమీందారు తండ్రిదనీ, సోమ్‌జీతండ్రి, జమీందారు తండ్రికి ఏదో ఉపకారం చేసినందుకు, తాత్కాలికంగా ఆభూమి అతనికివ్వబడిందనీ, అది దానం చెయ్యబడలేదనీ, కేవలం దానిమీదవచ్చే పంటను సోమ్‌జీతండ్రి బ్రతికున్నంతవరకు అనుభవించవచ్చనీ, తరవాత ఆ భూమి జమీందారుకి అప్పజెప్పాలనీ, కొంతకాలం తరవాత జమీందారు తండ్రీ సోమ్‌జీతండ్రీ పరమపదించారనీ, సోమ్‌జీ భూమిని జమీందారుకి వప్పజెప్పలేదనీ, సోమ్‌జీ తండ్రి తరవాత సదరుభూమిని సోమ్‌జీయే సేద్యం చేస్తున్నాడనీ, పాతకాగితాలన్నీ తిరగవేస్తే, ఈ సంగతులన్నీ వెలుగులోకి వచ్చాయనీ, ఆభూమిని వప్పగించాలనీ, గత నాలుగైదు సంవత్సరాల్లో సోమ్‌జీకి వచ్చిన లాభంలో భాగం ఇప్పించాలనీ.

కేసు పెట్టాక, ఒకరిద్దరు ముసలాళ్ళకు డబ్బిచ్చి సాక్షులుగా చేసుకున్నాడు జమీందారు. ఇంతకూ జమీందారు తల్చుకుంటే ఇదొక లెక్కా! గొప్ప గొప్ప వకీళ్లుకూడా అతని తరఫున వకాల్తా పుచ్చుకోటానికి తయారుగా వుంటారు. సోమ్‌జీ తరఫున ఎవ్వరూలేరు. కోర్టుకేసు పూర్తయింది. జమీందారు తాలూకువకీలు సోమ్‌జీతో అన్నాడు—"ఇహనుండి నీపొలం నీసొత్తుకాదు." "కాదుకాదు, అలాకాదు. ఈ ప్రపంచంలో ఇంత అన్యాయం జరగటానికి వీల్లేదు. ఆదేవుడే నన్ను రక్షిస్తాడు;" అన్నాడు సోమ్‌జీ ఏడుపు మొహంతో. "ఈ ప్రపంచానికి మేమేదేవుళ్ళం. మేం నూతనప్రపంచాన్ని సృష్టిస్తున్నాం. నిజాన్ని అబద్ధంగా అబద్ధాన్ని నిజంగా రుజువుచేసేశక్తి మాలోవుంది. మాశక్తి సామర్థ్యాలెదుట మీ దేవునిశక్తి బలాదూర్! మేంచెప్పిందే వేదవాక్కు." జమీందారుగారి వకీలు ఉవాచ.

మేజిస్ట్రేటుగారి తీర్పుకూడా ఈవిధంగానుంది. "ఈ భూమి జమీందారుది. ఇంతవరకు జమీందారు కళ్ళల్లో కారంజల్లి ఈ భూమిని సోమ్‌జీ స్వాధీనం చేసుకున్నాడు. ఇటీవల కొన్ని సంవత్సరాలవరకు సదరు పొలాన్ని సాగుచేసి పర్యాప్తంగా డబ్బు గడించాడు. ఇహనుండీ ఈ పొలం జమీందారు సొత్తు. దానిమీద సోమ్‌జీకి ఏవిధమైన

అధికారమూ లేదు. ఇంతవరకు ఆర్జించిన డబ్బులో కొంత భాగమన్నా సోమ్‌జీ ఇచ్చుకోవాలి. లేని పరిస్థితుల్లో జమీందారు దగ్గర చాకిరిచేసి సదరు బాకీని తీర్చుకోవచ్చు." "ప్రపంచంలో న్యాయమే లేదు. దేవుడు చచ్చిపోయాడా!" ఏడుస్తూ అరిచాడు సోమ్‌జీ. "ఏస్," అదే స్వరంలో మేజిస్ట్రేటుకూడా అరిచాడు.

తన పొలంలోనే చాకిరీచేశాడు సోమ్‌జీ. పొలం పనిలో ఎంత కష్టపడినా తృప్తికరమైన పంటలు పండలేదు. ఈ తీర్పు భూమాతక్కూడా ఇష్టంలేక పోయిందేమో! తీర్పు ప్రకారంగా జమీందారుకి సేవచేసి బాకీతీర్చేశాడు. ఆ తరువాత కూలిచేస్తూ కాలం గడపసాగాడు. సోమ్‌జీ భూమిని స్వాధీనంచేసుకున్నాక జమీందారు చేసిన అత్యాచారాల సంఖ్య పెరిగిపోయింది. ఆ పరిసర ప్రాంతాల్లోని రైతులంతా హాహాకారాలు చేసారు. అందరూ ఏకగ్రీవంగా గోలపెట్టారు.

ఓనాడు వాళ్ళరాజు ఆ ప్రదేశాన్ని పర్యటించాలని వచ్చాడు. జమీందారు, తన గ్రామానిక్కూడారమ్మని ఆహ్వానించాడు. రాజాగారు వస్తున్నారని, గ్రామాన్ని చక్కగా అలంకరించారు. కాని రాజుగారి సమక్షానికి ఏ రైతూ రాకుండా కట్టుదిట్టం చేశాడు జమీందారు. చుట్టుప్రక్కల వున్నధనికులే ఆ సమారోహంలో పాల్గొన్నారు.

ఆఖరికి మహారాజుగారు రానేవచ్చారు. కాని ఈ ఘంటారావం ఎక్కడనుండి వినిపిస్తోంది?

ఊరిబయట ఓపాతదేవాలయముంది. అక్కడే ఓ పెద్దగంట వాయిస్తారు. పేదవాడయితే కొద్దిసేపు వేయిస్తారు. ఊళ్లో పెద్దమనిషిగా చలామణీ అయిన వ్యక్తిగానీ, లేకధనికుడుగానీ, చచ్చిపోతే, గంటకాస్త ఎక్కువసేపు వాగుతుంది. కాని, ఒకే వరసను ఇంతవరకు వాగుతోందే!

అరే, మహారాజావారి స్వాగతం కోసంవచ్చిన ప్రముఖులంతా ఇక్కడే వున్నారే! అంతా విచిత్రంగావుంది.

ఘంటారావం ఇంకా జోరయింది. ఆ గోలకి చదువుతున్నది ఏమీ వినబడలేదు. "ఇంతసేపటివరకు చెవులో గీలమంటోన్న ఆ ఘంటారావం ఏమిటి?" అని ప్రశ్నించాడు రాజు. "ఎవరన్నా గొప్ప వ్యక్తి చనిపోతే, కొంతసేపటివరకూ ఆ గంట వాయిస్తారు. కాని, ఇంతవరకు ఆ గంట వాగుతోంది అంటేమాత్రం ఇదేదో అల్లరిచేసే ప్రయత్నమేనని నాకు అనుమానంగా వుంది. ఇక్కడ రైతులు పరమదుర్మార్గులు. చూశారా ప్రభూ! ఒక్కడన్నా ఈ సభకు వచ్చాడా? అందరూ ఏదో కుట్రపన్ని సమ్మెచేశారల్లే వుంది" అన్నాడు

దేవాలయానికి తన సైనికుల్ని పంపించాడు రాజు. ఊళ్లోని ప్రజలంతా దేవాలయందగ్గర గుమిగూడారు. ఇంతకూ ఆ గంట వాయిస్తున్నది సోమ్‌జీ. "సోమ్‌జీ! ఎవరు పోయారని ఇంతసేపటివరకూ గంట వాయిస్తున్నావు?" ప్రశ్నించాడు పూజారి. "న్యాయం చచ్చిపోయింది. ఎంతసేపన్నా గంట వాగుతుంది" అన్నాడు సోమ్‌జీ. అందరూ ఒకర్నొకరు ప్రశ్నించుకున్నారు "ఎవరు పోయారు?" "న్యాయదేవత చచ్చిపోయింది"

సైనికులు తిరిగి వచ్చేశారు. అంతా విన్నాక రాజు స్వయంగా దేవాలయందగ్గరకు చేరుకున్నాడు. ఈలోగా సోమ్‌జీ ఓ కట్టె తయారు చేశాడు. అందరూ కేకలువేశారు—"న్యాయదేవత చచ్చిపోయింది;" "ఎవరు పోయారు?" రాజు ప్రశ్నించాడు. "న్యాయదేవత చచ్చిపోయింది" అటునుండి వచ్చిన ప్రత్యుత్తరం. "నేను బ్రతికుండగానే నాకన్నా ముందుగా న్యాయదేవత చచ్చిపోయిందా!" రాజుకు కుతూహలం. "మీరుండేది రాజధానిలో. ఇటు సామంతులు లంచగొండులయ్యారు. న్యాయాన్ని హత్యచేశారు. మేమంతా రైతులం. మా భూముల్ని జమీందారు స్వాధీనం చేసుకున్నాడు. మా గోడు మీవరకూ రాదు. వాళ్లు రానివ్వరు. ఈనాడుజరిగిన సభకుకూడా మమ్మల్ని రానివ్వలేదు. మీ దర్శనం కూడా అలభ్యమన్నారు" రైతులస్వరాలకు రాజు స్తబ్ధుడయ్యాడు.

"ప్రజలారా! నేను బ్రతికున్నంతవరకు న్యాయదేవత చావదు. ఇదిగో ఇప్పుడే బ్రతికిస్తున్నా. మీ భూములు మీకు దొరుకుతాయి. ఈ రాక్షసులకు ద్వీపాంతరవాస శిక్ష విధిస్తున్నాం. న్యాయం చస్తే రాజ్యాలే నశిస్తాయి. మీకు జరిగిన అన్యాయాలకు క్షమించమని నా ప్రార్థన" అన్నాడు.

"మహారాజాకీ జై. న్యాయదేవత బ్రతికిపోయింది" కేకలు ఆకాశాన్ని ఢీకొన్నాయి.

(అనువాదం: శశిభూషణ్ పాత్రో)